క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేష వస్త్రాలను అందజేశారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పరవాడ: పరవాడ 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చేపట్టనున్న జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఏఈ ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, దలాయిపాలెం, దోసూరు, నునపర్తి పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పెరుగుతున్న 'రైవాడ' నీటిమట్టం

- కొనసాగుతున్న 680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 108.60 మీటర్లు



నిండుకుండలా రైవాడ జలాశయం

దేవరాపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు రైవాడ జలాశయం నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 680 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 108.60 మీటర్లకు చేరుకుంది. జలాశయం నీటిమట్టం పెరుగుతుండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నారుమడులు ఏపుగా ఎదుగుతుండటంతో దమ్ములు చేసేందుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. ఖరీఫ్ పంటలకు సాగునీటికి ఢోకా ఉండబోదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఒకట్రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జలాశయంలోకి మరింత వరద నీరు వచ్చి చేరుతుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో అందుబాటులోకి వైద్యం

- డీఎంహెచ్‌వో హేమంత్



సీతానగరం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

అనకాపల్లి రూరల్: విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో ప్రజలకు అవసరమైన వైద్య సేవలు గ్రామాల్లోనే అందుబాటులోకి వచ్చాయని జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ హేమంత్ తెలిపారు. మండలంలోని సీతానగరంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. క్లినిక్‌లో ఉన్న ఔషధాల నిల్వలు, వాటి బట్వాడాకు సంబంధించిన రికార్డులు, వైద్య సేవల నిర్వహణ రికార్డులు పరిశీలించారు. ఈ ఆశ యాప్‌లో నమోదు చేస్తున్న వివరాలపై ఆరా తీశారు. ఇంటింటికీ వెళ్లి సేకరిస్తున్న ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నిక్షిప్తం చేయాలని ఆశాలకు సూచించారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను సందర్శించి, పిల్లల, విద్యార్థుల హెల్త్ చెకప్‌నకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పెడుతున్న పోషకాహార వివరాలను ఆరా తీశారు. పిల్లల్లో రక్తహీనత లేకుండా చూడాలని అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులకు చెప్పారు. కార్యక్రమంలో తగరంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు జి.పావని, హెల్త్ సూపర్‌వైజర్లు శంకర్, సాంబశివరావు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులకు మేలు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- పెందుర్తిలో ధ్రువపత్రాల అందజేత



జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో మేలు చేస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ఎలాంటి యూజర్ చార్జీలు లేకుండా సత్వరమే పదకొండు రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు అందిస్తున్నారని చెప్పారు. జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తిలోని తాండ్ర పాపారాయుడు కల్యాణమండపంలో 510 నుంచి 520 వరకు ఉన్న సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పలు కారణాల వల్ల అందుకోలేని వారిని అర్హులుగా గుర్తించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా జగనన్న సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. దానికి అవసరమయ్యే సర్టిఫికెట్లకు కూడా ఏ ఖర్చు లేకుండా ధ్రువపత్రాలను అందిస్తున్నారని చెప్పారు. పేదలకు ఈ పథకం ఎంతో మంచి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, పార్టీ మండల అధ్యక్షుడు నక్క కనకరాజు, పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, పార్టీ నాయకులు గొర్లె నరసింహమూర్తి, దాడి ఉమా మహేష్, జోబ్ దాస్, నూకరత్నం, లెక్కల వేణు, 8వ జోన్ జీవీఎంసీ కమిషనర్ మల్లయ్యనాయుడు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సబ్బవరం-3, సబ్బవరం-4 సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించనున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే గ్రామసభలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు. అలాగే, ప్రజలు వలంటీర్ల ద్వారా తెలియజేసిన సమస్యలపై అధికారులతో చర్చిస్తారని తెలియజేశారు. ఉదయం 9:30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ఆయా సచివాలయాల పరిధిలో గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరవాడ మండలంలో..

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఏర్పాటు చేయనున్న జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొంటారని పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు తెలిపారు. ఉదయం 9 గంటలకు నాయుడుపాలెం, 10 గంటలకు ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని, దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేస్తారని తెలియజేశారు.

బైక్ ఢీకొని ఒకరు దుర్మరణం



ప్రమాద స్థలిలో అజేయ్‌ఠాకూర్ మృతదేహం

పరవాడ: వాడచీపురుపల్లి - ముత్యాలమ్మపాలెం రహదారిలో వాడచీపురుపల్లి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో జార్ఖండ్‌కు చెందిన అజేయ్‌ఠాకూర్ (50) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. జార్ఖండ్‌కు చెందిన పలువురు యువకులు ఇక్కడ అద్దె ఇంట్లో ఉంటూ ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో గదికి వచ్చిన ఠాకూర్ సమీపంలోని కుళాయి నుంచి మంచినీరు తీసుకుని రావడానికి వెళ్లాడు. బకెట్లతో నీరు పట్టుకొని గదికి నడుచుకొంటూ వస్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనచోదకుడు ఠాకూర్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఠాకూర్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పరవాడ ఎస్‌ఐ సిరపరపు సురేష్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. పరవాడ సీఐ ఈశ్వరరావు పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: అర్హతే ప్రాతిపదికగా పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 85వ వార్డు ఇ.మర్రిపాలెంలో గురువారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా, ప్రజలకు మేలు చేసే ఎన్నో కార్యక్రమాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. అటువంటి నాయకుడి పాలన మరింత కాలం కొనసాగేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రతీ విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థపై చులకనగా మాట్లాడటం పవన్ కల్యాణ్, చంద్రబాబుల అవివేకానికి నిదర్శనమన్నారు. కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్-2 ఇల్లపు ప్రసాద్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, కింతాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి పంట కాలువలు

ఉపాధి హామీ పథకంతో పంట కాలువల దశ తిరిగింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో పంట కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపడుతున్నారు. దీన్ని ఉపాధి పథకానికి అనుసంధానించారు. దీంతో గ్రామాల్లో జాబ్‌కార్డుదారులకు ఉపాధితో కల్పన, పంట కాలువల పునరుద్ధరణ ఏకకాలంలో జరుగుతోంది.



ఉపాధి హామీ పథకంలో పంట కాలువలో పూడిక తీత పనులు
(ఇన్‌సెట్) ఉద్యానపంటల్లో మొక్కలకు కుంటలు చేస్తున్న ఉపాధి కూలీలు

జిల్లాలో వివరాలు

- 24 మండలాల్లో ఉపాధి పనులకు రూ.27.17 కోట్లు మంజూరు
- వీటిలో ఇప్పటి వరకు ఖర్చు చేసింది రూ.9.50 కోట్లు
- ఇప్పటి వరకు జరిగిన ఉపాధి పని దినాలు 91 లక్షలు
- కాలువల్లో పూడిక తీత, కుంటలు తవ్వేందుకు 3.74 లక్షల పనిదినాలు
- జిల్లాలో జాబ్‌కార్డులు 2,39,421, వేతనదారులు 1,47,210 మంది

- ఖరీఫ్ ప్రారంభం కానుండటంతో పంట కాలువల్లో పూడికతీత
- ఇప్పటి వరకు 659 వ్యవసాయ కాలువల్లో పూడిక తొలగింపు
- జిల్లాలో 10 వేల ఎకరాల్లో ఉద్యాన తోటలకు పంట కుంటలు

సాక్షి, అనకాపల్లి: ఉపాధి పనులు జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతున్నాయి. ఏడాది కాలంగా పిచ్చి మొక్కలతో, పూడికలతో నిండివున్న పంట కాలువలకు, గట్లకు మోక్షం కలుగుతోంది. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతులు పంట కాలువ పనులను, గట్లను సొంత డబ్బులు వెచ్చించి పనులు చేపడతారు. ఇపుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కాలువల పనులు, గట్లు, రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కల తొలగింపు తదితర పనులను కూడా ఉపాధి పథకంలో చేపట్టేందుకు శ్రీకారం చుట్టాయి. వీటికోసం ప్రత్యేకంగా నిధులను కూడా మంజూరు చేశాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రైతుల విన్నపం మేరకు ఉపాధి పనులు జరుగుతున్నాయి.

అమృత్ సరోవర్‌తో జల కళ

ఇప్పటికే అమృత్ సరోవర్ పథకంలో చెరువులు, కాలువల తవ్వకం పనులు చేపట్టారు. జిల్లాలో 75 ప్రధాన చెరువుల్ని ఈ కార్యక్రమంలో ఎంపిక చేసి ఆగస్టు నాటికి పూర్తి చేయాలని లక్ష్య నిర్దేశనం చేశారు. అయితే అధికారుల ప్రత్యేక చొరవ, జాబ్‌కార్డుదారులకు ఎక్కువ పనిదినాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేయడంతో 105 చెరువుల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. అనంతరం కాలువలను కూడా ఖరీఫ్ సీజన్ వర్షాలకు ముందే పూడిక తొలగించి, సాగునీటి ప్రవాహానికి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే 659 పంట కాలువల్లో పూడిక తీత పనులు పూర్తి చేశారు. మిగిలిన కాలువల్లో కూడా త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

కోటీ 14 లక్షల పని దినాలు లక్ష్యం

వేసవిలో సాధ్యమైనంత మేరకు జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పని కల్పించేందుకు ప్రభుత్వ యంత్రాంగం చొరవ చూపింది. గ్రామ స్థాయిలో అవసరమైన ప్రతి పనినీ ఉపాధి పథకంలో చేర్చేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. వ్యవసాయాధార గ్రామాల్లో చెరువులు, కాలువలు, రోడ్లు, గట్లు ఇలా ప్రతి దానినీ అభివృద్ధి చేసేందుకు ప్రయత్నించారు. అందుకే 2023-24లో ఉపాధి హామీ పథకంలో భాగంగా కోటీ 14 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 91 లక్షల పనిదినాలు కల్పించారు. వీటిలో పంట కాలువల్లో పూడిక తొలగింపు, ఉద్యాన పంటల్లో కుంటలు తవ్వకం పనులే 3.74 లక్షల పనిదినాలు.

రైతులకు మేలు కలిగేలా..



ఈ ఏడాది ఉపాధి హామీ పనులు కోటీ 14 లక్షలుగా నిర్దేశించాం. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేటి వరకూ 91 లక్షల పనిదినాలు కల్పించాం. వీటిలో పంట కుంటలు, కాలువల పూడికతీతలో 3.74 లక్షల పనిదినాలు పూర్తి చేశాం. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో రైతుల విన్నపం మేరకు పంట కాలువ, ఉద్యానవన కుంటలపై ఉపాధి పనులు జరుగుతున్నాయి.

– సందీప్, డ్వామా పీడీ

వ్యవసాయ డ్రోన్ల వినియోగానికి అధికారుల కసరత్తు

ఆనందపురం : ఆనందపురం మండలంలో వ్యవసాయ డ్రోన్లు వినియోగించడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. కూలీల కొరతతో రైతులు సకాలంలో ఎరువులు, పురుగు మందులు పొలాల్లో వేసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇతరత్రా పనులు చేపట్టడానికి అవకాశం లేకుండాపోతోంది. దీంతో రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని డ్రోన్ల ద్వారా వ్యవసాయ సహాయక పనులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆనందపురం మండలానికి ఆరు డ్రోన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ముందుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆసక్తి గల ఐదుగురు రైతులు కలిసి కస్టమర్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ)ను ఏర్పాటు చేసుకోవాలి. అందులో ఐటీఐ లేదా ఇంటర్మీడియట్ చదివిన ఒకరిని పైలట్‌గా ఎన్నుకోవాలి. వారికి వ్యవసాయ శాఖ ద్వారా గుంటూరులో 15 రోజులపాటు శిక్షణ అందిస్తారు. డ్రోన్ కొనుగోలుకు గ్రూపు సభ్యులు 10 శాతం వాటా చెల్లిస్తే, 40 శాతం రాయితీ, 50 శాతం బ్యాంక్ రుణంతో సుమారు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు విలువ చేసే డ్రోన్‌ను ప్రభుత్వం సమకూరుస్తుంది. ఆ డ్రోన్లతో పొలంలో పురుగు మందులు పిచికారీతోపాటు, విత్తనాలు, జల ఎరువులు కూడా చల్లడానికి వినియోగించుకోవచ్చు. రైతులు అద్దె ప్రాతిపదికన ఇతర రైతులకు డ్రోన్ల సేవలు అందించవచ్చు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సంధ్యా రత్న ప్రభ మాట్లాడుతూ డ్రోన్ల వినియోగం వల్ల రైతులకు ఖర్చు తగ్గడంతోపాటు ఎక్కువ విస్తీర్ణంలో చాలా తక్కువ సమయంలో ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అర్హత గల వారిని ఎంపిక చేసి శిక్షణకు పంపిస్తామని తెలిపారు.

మృతుని కుటుంబానికి రూ. 23 లక్షల పరిహారం

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీ స్మైలెక్స్ పరిశ్రమలో బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామానికి చెందిన నాగులాపల్లి నాగేశ్వరరావు (24) కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యం నష్ట పరిహారంగా రూ. 23 లక్షలు చెల్లించడానికి అంగీకారం తెలిపిందని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ చెప్పారు. బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరిందని చెప్పారు. దహన సంస్కార ఖర్చుల నిమిత్తం మరో రూ.50 వేలు అదనంగా చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. చర్చల్లో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకర్రావు, ఈ.బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కస్నూరి వెంకటరమణ పాల్గొన్నారు. చర్చలు ఫలించడంతో బుధవారం అర్ధరాత్రి తర్వాత మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



కమిటీ సభ్యులకు రూ.1 లక్ష చెక్కును అందిస్తున్న శ్రీనివాస్ సోదరుడు స్వామినాయుడు

సబ్బవరం: సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని పెదనాయుడుపాలెం శివారు గణపతిపురం గ్రామంలో కొలువైన స్వయంభూ మల్లికార్జున స్వామి ఆలయ పునర్నిర్మాణానికి తవ్వవానిపాలేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోకం శ్రీనివాస్ లక్ష రూపాయలు విరాళంగా అందించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద ఆయన సోదరుడు, తవ్వవానిపాలెం సర్పంచ్ బోకం స్వామినాయుడు చేతుల మీదుగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు గురువారం చెక్కును అందించారు. వారికి కమిటీ సభ్యులు మండల లక్ష్మణ, బోకం రామకృష్ణ, సబ్బవరపు శివ, సబ్బవరపు నాగభూషణం తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కిల్లి వెంకట సత్యనారాయణ, బోకం రమణ, బొడ్డు రమణ, సబ్బవరపు ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వీఆర్‌ఏలు

పరవాడ: వీఆర్‌ఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మండల వీఆర్‌ఏ సంఘ జిల్లా కోశాధికారి ఎం.సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం వీఆర్‌ఏలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న పోస్టులు నామినీ ఈఆర్‌ఏలతో నింపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం చెల్లించకుంటే ఆందోళన విస్తృతం చేస్తామన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి రావాడ శంకర్, అధ్యక్షుడు శేఖర్, వై.బాబూరావు, రాము, అప్పలనర్సమ్మ, సన్యాసిరావు, రాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సబ్బవరం: అపరిష్కృతంగా ఉన్న వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని పలువురు వీఆర్‌ఏలు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకట్‌కు మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు ఎస్.గంగాధరరావు ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మూడు దశల్లో దీక్ష చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- పట్టపగలే బంగారం అపహరణ

పరవాడ: మండలంలో నాయుడుపాలెం శివారు చాకలిపేట గ్రామానికి చెందిన ఇరుముళ్ల పైడిరాజు ఇంట్లో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎనిమిదిన్నర తులాల బంగారు ఆభరణాలు దొంగలించుకుపోయారని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. సీఐ ఈశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పైడిరాజు ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. అతని భార్య దీపాంజలినగర్‌లోని క్యాంటీన్‌లో పని చేస్తోంది. వీరు గురువారం ఉదయం కుమార్తెను తీసుకుని, ఎవరి పనులకు వారు వెళ్లిపోయారు.

ఇంటి వద్ద మేకలకు మేత వేసేందుకు మధ్యాహ్నం 1గంట సమయంలో పైడిరాజు ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో గదిలో బీరువా తెరిచి ఉండడం, వెనక డోరు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగిందని గమనించాడు. వెంటనే పరవాడ పోలీసులకు తెలియజేయడంతో సీఐ ఈశ్వరరావు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించింది. క్లూస్ టీమ్ సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు పరిసర ప్రాంతాలకు చెందిన వారై ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. చోరీకి గురైన బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

నేటి నుంచి ఇంటింటా ఓటర్ సర్వే



ఓటర్ల నమోదుపై రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- సర్వే నిర్వహించే బీఎల్వోలకు సహకరించండి
- రాజకీయ పార్టీల సమావేశంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు 32 రోజుల పాటు బీఎల్వోల ద్వారా ఇంటింటి ఓటరు సర్వే నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై సర్వే చేస్తారని తెలిపారు. ఎన్నికల నామినేషన్లకు 10 రోజుల ముందు వరకు ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 18 ఏళ్లు నిండి వారు ఓటరుగా నమోదయ్యేలా రాజకీయ పార్టీలు అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓటున్నా, సర్వేలో పొరపాట్లను గుర్తించిన వెంటనే తమకు తెలియజేయాలన్నారు. జాబితాలో ఓటరు పేరు, పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసుకునేందుకు ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్, voters.eci.gov.in వెబ్‌సైట్‌లో తనిఖీ చేసుకోవచ్చన్నారు. ఈ సర్వే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వచ్చే బీఎల్వోలకు ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు. పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. ఓటరు సర్వే చేసినట్లు ఇంటికి మార్కు చేయాలని, మద్యం తాగి వచ్చే వారికి ఓటు వేసే అవకాశం కల్పించకూడదని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు కోరారు. సమావేశంలో డీఆర్వో పి.వెంకటరమణ, సెక్షన్ సూపరింటిండెంట్ లక్ష్మీదేవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నరసింహరావు, బి.శ్రీనివాసరావు, ఎస్వీపీ రామచంద్రరావు, కె.హరనాథ్‌బాబు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం

అనకాపల్లి టౌన్: స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృతస్థాయి స మావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అ ధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొంటారని చెప్పారు. ఎమ్మెల్యేలు తదితర ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.